క్లుప్తంగా

మెట్ట దుక్కులు ప్రారంభం

చాట్రాయి: మారిన వాతావరణంతో కురుస్తున్న వర్షాలకు మండలంలోని రైతులు మెట్ట దుక్కులకు శ్రీకారం చుట్టారు. దున్నిన వ్యవసాయ భూముల్లో నీటి నిల్వలతో తేమ శాతం పెరుగుతుంది. పచ్చిరొట్ట విత్తనాలు విత్తుకునేందుకు అనువుగా మారింది. ముందుగా దుక్కులు దున్నడం వల్ల భూముల్లో ఉన్న క్రిములు బయటకు రావడంతో పక్షులు తింటాయని రైతులు చెబుతున్నారు. పశువుల ఎరువులు మెరక భూములు, వరి పొలాలకు తరలిస్తూ మెట్టదుక్కులు దున్నుతున్నారు.

భగవద్గీత శ్లోకాల పఠనంపై శిక్షణ



తిరువూరు: స్థానిక శ్రీ వేంకటాచల స్వామి దేవస్థానంలో చిన్నారులకు భగవద్గీత శ్లోకాల పఠనంపై శిక్షణ ఇస్తున్నారు. చిన్ననాటి నుంచే పిల్లలకు సంప్రదాయాలు, భక్తిభావాలు పెంపొందించడంలో భాగంగా భక్తబృందం ఆధ్వర్యంలో చేపట్టిన శిక్షణా కార్యక్రమానికి పలువురు బాలలు హాజరవుతున్నారు. ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి శిక్షణా కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

చింతలపాడులో బడిబాట



తిరువూరు: మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చింతలపాడులో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బడిఈడు పిల్లలను గుర్తించి ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సదుపాయాలను, విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న పలు పథకాలను వివరిస్తూ అడ్మిషన్లు కల్పించారు. మధ్యాహ్న భోజన పథకం, అమ్మ ఒడి, విద్యా కానుక, ఉచిత పాఠ్యపుస్తకాలు తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ కన్వీనర్ రాంప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

విస్సన్నపేట: మండలంలోని కొండపర్వ గ్రామంలో మామిడితోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక బైక్, రూ. 16,800 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

కోడిపందేలపై దాడి

మండలంలోని వేమిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేలపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక కోడి పుంజు, నాలుగు బైకులు, రూ.4,210 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. గ్రామాల్లో జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఆర్థిక సాయం అందజేత



ఎ.కొండూరు: రేపూడి గ్రామానికి చెందిన పాల ఉత్పత్తిదారుడు బి. జమలారెడ్డి ఇటీవల మృతి చెందారు. క్షీరబంధు పథకం ద్వారా రూ. 50 వేల ఆర్థిక సహాయం చెక్కును మృతుడి భార్య బి. వెంకమ్మకు ఆదివారం అందించారు. కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ ట్రస్ట్ సభ్యులు ఎం. విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు వజ్రాల బ్రహ్మానందరెడ్డి, తిరువూరు పాల శీతల కేంద్రం మేనేజర్ టి.సాంబశివమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దీక్ష విరమణ మహోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షా పీఠంలో ఈ నెల 28వ తేదీ నుంచి దీక్ష విరమణ మహోత్సవాలు ప్రారంభమవుతాయని పీఠాధిపతి శ్రీదుర్గా ప్రసాద్ స్వామీజీ పేర్కొన్నారు. 28వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి హనుమత్ దీక్షలను విరమిస్తారని, అందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు స్వామీజీ పేర్కొన్నారు. 28వ తేదీ ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, స్వామి వారికి పూజా కార్యక్రమాలతో దీక్ష విరమణలు ప్రారంభమవుతాయన్నారు. జూన్ 1వ తేదీ హనుమత్ జయంతిని పురస్కరించుకుని ఆంజనేయ స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు, అర్చన నిర్వహిస్తామని చెప్పారు. జూన్ 2వ తేదీ ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో మహా పూర్ణాహుతితో దీక్ష విరమణలు పరిసమాప్తం అవుతాయని తెలిపారు.

విజ్ఞానం.. వినోదం

- వేసవి శిక్షణా శిబిరాలకు అపూర్వ స్పందన
- సెల్‌ఫోన్లకు దూరంగా విద్యార్థులు
- ఆటపాటలతో చిన్నారుల కాలక్షేపం
- వేసవి సెలవులు సద్వినియోగం



తిరువూరు గ్రంథాలయంలో చిత్రలేఖనం నేర్చుకుంటున్న బాలలు

తిరువూరు: వేసవి సెలవుల్లో బాలబాలికల అభిరుచుల కనుగుణంగా ఆటపాటలు నేర్చుకునేందుకు వేసవి శిక్షణా శిబిరాలు ఉపయోగపడుతున్నాయి. తిరువూరు పట్టణంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ శాఖా గ్రంథాలయంలో గత నెల రోజులుగా విద్యార్థులకు చదరంగం, క్యారమ్స్, చిత్రలేఖనం, తెలుగు పద్యాలు, సైన్స్‌లో ముఖ్యాంశాలలో శిక్షణ ఇస్తున్నారు. యోగాసనాలు వేయడంలోనూ చిన్నారులకు అవగాహన కల్పిస్తున్నారు. పేపర్ క్రాఫ్ట్స్ తయారీ, వ్యర్థ పదార్థాలతో ఫ్లవర్ వాజ్‌లు, బొమ్మల తయారీలో శిక్షణ ఇస్తున్నారు. దాతల సహకారంతో విద్యార్థులకు అల్పాహారం కూడా అందిస్తుండటంతో అధిక సంఖ్యలో విద్యార్థులు శిబిరాలకు హాజరవుతున్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలు ఈ శిబిరాలకు రావడంతో కొద్ది సమయమైనా సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటున్నారని చెబుతున్నారు. కొత్త విద్యా సంవత్సరంలో విద్యార్థులు చేరే తరగతిలో పాఠ్యాంశాలపై కూడా ఉపాధ్యాయులు శిక్షణా తరగతుల్లో గ్రంథాలయాధికారి పద్మావతి ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నారు.



తిరువూరు గ్రంథాలయంలో చదరంగం నేర్చుకుంటున్న విద్యార్థులు

శిక్షణ సద్వినియోగం

తిరువూరులోని ఐడియాస్ సేవా సంస్థ గ్రామాల్లో, తిరువూరు పట్టణ శివార్లలోని ఆవాస ప్రాంతాల్లో వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తోంది. పలు క్రీడాంశాలతో పాటు పిల్లల అభిరుచుల కనుగుణంగా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణా తరగతుల్లో ఇంద్రజాల ప్రదర్శన నేర్పడం, నిత్యజీవితంలో సైన్స్ ఆవశ్యకత వివరించడం, దినపత్రికలు, పుస్తకాల పఠనం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వేసవిలో ప్రత్యేక తరగతులు నిర్వహించరాదని ప్రభుత్వం అన్ని పాఠశాలలకూ ఆదేశాలివ్వడంతో శిక్షణా కార్యక్రమాలకు బాలబాలికలు హాజరవుతున్నారు.



చెస్ నేర్చుకున్నా

నాకు ఎప్పటి నుంచో చదరంగం నేర్చుకోవాలని ఉన్నా అవకాశం దొరకలేదు. తిరువూరు లైబ్రరీలో సమ్మర్ క్యాంపునకు హాజరై చెస్ ఆడటం నేర్చుకున్నాను. అర్థమయ్యే విధంగా అన్ని విషయాలూ చెబుతున్నారు.

– హయగ్రీవ, 6వ తరగతి విద్యార్థి, తిరువూరు



తెలియని విషయాలు నేర్పుతున్నారు

స్కూల్లో కేవలం మా తరగతికి సంబంధించి నేర్చుకుంటుండగా, వేసవి శిక్షణా తరగతుల్లో కల్చరల్, గేమ్స్ వంటి అనేక అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. వేసవి సెలవులను వృథా చేసుకోకుండా మాకు ఇష్టమైన సబ్జెక్టులు నేర్చుకుంటున్నాం.

–జి. శార్వాణి, 8వ తరగతి విద్యార్థిని, తిరువూరు



డ్రాయింగ్ నేర్చుకున్నా

నాకు ఎప్పటినుంచో బొమ్మలు వేయాలంటే ఇష్టం. కానీ నేర్చుకునే అవకాశం రాలేదు. తిరువూరు లైబ్రరీలో ఏర్పాటు చేసిన శిబిరంలో నేను డ్రాయింగ్ నేర్చుకున్నాను. బొమ్మలు ఎలా వేయాలో ఉపాధ్యాయులు చాలా సులువుగా తెలియజేశారు.

– షేక్ ఆయేషా, 7వ తరగతి విద్యార్థిని, తిరువూరు



డ్యాన్స్, పాటలు పాడటం నేర్చుకున్నా

తిరువూరు గ్రంథాలయంలో ప్రతి సంవత్సరం వేసవి శిక్షణా తరగతులకు హాజరవుతున్నా. తెలియని విషయాలు చాలా నేర్చుకుంటున్నా. డ్యాన్స్, పాటలు పాడటం నేర్చుకున్నా. ఈ తరగతులకు ఎంతో ఇష్టంగా హాజరవుతున్నా.

– అల్లాడ మీనాక్షి, తిరువూరు

తిరుపతిరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రార్థనలు



తిరుపతిరావును సత్కరిస్తున్న పాస్టర్ జాన్ ఐజాక్

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విజయవాడ రూరల్ జక్కంపూడి వైఎస్సార్ కాలనీ 56వ బ్లాక్‌లోని హోప్ ప్రేయర్ ఫెలోషిప్ చర్చి నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఆదివారం వచ్చిన ఆయనకు వారు సాదర స్వాగతం పలికారు. అనంతరం జూన్ 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌లో సర్నాల తిరుపతిరావు మంచి మెజారిటీతో విజయం సాధించాలని చర్చి పాస్టర్ జాన్ ఐజాక్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీస్సులు అందజేశారు. తిరుపతిరావును ఈ సందర్భంగా సంఘస్తులు సత్కరించారు. తిరుపతిరావు మాట్లాడుతూ పేదవాడిని, వైఎస్సార్ సీపీ సామాన్య కార్యకర్తను అయిన తనపై నమ్మకంతో టికెట్ ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, తనను ఆశీర్వదించి ఓట్లు వేసిన మైలవరం నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్ కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు మారపాక రాంబాబు, బీసీ సెల్ నాయకులు ఏసుబాబు, గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నక్కా ప్రభుదాస్, సంఘ పెద్దలు, కాపరులు పాల్గొన్నారు.

శరవేగంగా అదనపు తరగతి గదుల నిర్మాణం





నూజివీడులోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్లో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల భవనం; నూజివీడులోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో నిర్మిస్తున్న అదనపు గదులు

- నాడు–నేడు ఫేజ్–2లో 35 గదుల నిర్మాణం
- సమకూరనున్న వసతులు
- త్వరలోనే అందుబాటులోకి

నూజివీడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. నాడు–నేడు పథకం ద్వారా నిధులు మంజూరు చేసి తొలి విడతలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చింది. తమ సర్వీసులోనే ఇలాంటి వసతులు ఏ ప్రభుత్వం కల్పించలేదని ఉపాధ్యాయులు సైతం చర్చించుకుంటున్నారు. వసతులు కల్పించడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదుల కొరత లేకుండా నాడు–నేడు రెండో విడతలో నూజివీడు మండలంలోని పలు హైస్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని చేపట్టారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి.. చాలినన్ని తరగతి గదులు లేని పాఠశాలలను గుర్తించి ఆయా పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది.

నూజివీడు మండలానికి రూ.4.18 కోట్లు మంజూరు

నాడు–నేడు ఫేజ్–2లో ప్రభుత్వ పాఠశాలల్లో.. ముఖ్యంగా హైస్కూళ్లలో అదనపు తరగతి గదులను నిర్మించేందుకు నూజివీడు మండలానికి రూ.4.18 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో 35 అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు. ఈ గదుల నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం ఉండదు. ఆరుబయట చెట్ల నీడలో కూర్చుని పాఠాలు వినే పరిస్థితి నుంచి విముక్తి కలగనుంది. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత పెద్ద ఎత్తున హైస్కూళ్ల అభివృద్ధికి కృషి చేసిన దాఖలాలు లేవు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో రూ.1.44 కోట్లతో 12 తరగతి గదులను, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ప్లస్‌లో రూ.1.08 కోట్లతో 9 తరగతి గదులు, గొల్లపల్లి హైస్కూల్‌లో రూ.94 లక్షలతో 8 తరగతి గదులు, మీర్జాపురం హైస్కూల్‌లో రూ.72 లక్షలతో 6 తరగతి గదులు నిర్మిస్తున్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో బాలికల జూనియర్ కళాశాలను సైతం ప్రభుత్వం నిర్వహిస్తోంది. దీంతో ఇక్కడ తరగతి గదుల కొరతను అధిగమించేందుకు రూ.1.08 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయా హైస్కూళ్లలో అదనపు తరగతి గదుల భవన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఒకవైపు జగనన్న విద్యా కానుక కింద విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్సులు, బ్యాగ్, షూలు, బెల్ట్ తదితర వాటిని ఉచితంగా అందిస్తూనే మరోవైపు పాఠశాలల్లో తరగతి గదుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ గదుల నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు మరింత సౌకర్యంగా ఉంటుంది. జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రాథమిక పాఠశాలలను హైస్కూళ్లలో కలిపినా తరగతి గదుల కొరత లేకుండా ఉంటుంది.

పుస్తక పఠనం.. చెస్ పోటీలు



కొండపల్లి గ్రంథాలయంలో చెస్ పోటీలో తలపడుతున్న బాలికలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థుల్లో విజ్ఞానంతోపాటు వినోదాన్ని నింపుతున్నాయని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు అన్నారు. కొండపల్లి శాఖ గ్రంథాలయం అధికారులు ఆదివారం విద్యార్థులకు నిర్వహించిన పుస్తక పఠనం, చెస్ పోటీలను ఆయన పరిశీలించారు. గంథాలయంలోని సమగ్ర సమాచారాన్ని ప్రతి విద్యార్థి విశ్లేషణతో కూడిన అవగాహన చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలు జూన్ 7వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరాల్లో పాల్గొనే విద్యార్థులకు ముగింపు రోజు సర్టిఫికెట్లు, బహుమతులు పంపిణీ చేస్తామని చెప్పారు. పీఆర్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదరంగం పోటీలు..

మైలవరం: మైలవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం విద్యార్థులచే పంచతంత్ర కథల పుస్తకాలు చదివించి, కథలు చెప్పించారు. తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె. నాగరాజు పర్యవేక్షణలో విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఈటీ నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయాల వల్ల ఉపయోగాలను వివరించారు. విద్యార్థులు గ్రంథాలయ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం



పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీపీ భాస్కరరావు

గుణదల(విజయవాడతూర్పు): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ, సమాజంలో అల్లర్లకు పాల్పడే అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని సెంట్రల్ ఏసీపీ భాస్కరరావు హెచ్చరించారు. మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గుణదల గంగిరెద్దుల దిబ్బ కొండ ప్రాంతంలోని వైఎస్సార్ కాలనీలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో శాంతి భద్రతలు పరిరక్షించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ముఖ్యంగా అల్లరి మూకల ఆగడాలు నియంత్రించే దిశగా పోలీసు యంత్రాంగం పని చేస్తోందని తెలిపారు. గంజాయి రవాణా, విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు దృష్టి సారించామన్నారు. అతి కొద్ది కాలంలో నగరంలో గంజాయి వినియోగం పూర్తిగా అదుపు చేస్తామని స్పష్టం చేశారు. నేర ప్రవృత్తి గల అసాంఘిక వ్యక్తులపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తామన్నారు. మహిళలపై అత్యాచారాలు, దోపిడీలు, గ్రూపు తగాదాలు గతంతో పోలిస్తే ప్రస్తుతం వాటి సంఖ్య తగ్గిందని చెప్పారు. రోడ్లపై మద్యం సేవించడం, బర్త్ డే పేరుతో కేకులు కట్ చేసి హల్ చల్ చేయడం, రోడ్లపై వాహనాల రేసింగ్ వంటివి నియంత్రించామన్నారు. అసాంఘిక శక్తులను అరికట్టే దిశగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా గుణదల గంగిరెద్దుల దిబ్బ కొండ ప్రాంతంలో ఉదయం 6 నుంచి 8 గంటల మధ్య అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. కార్యక్రమంలో మాచవరం సీఐ గుణరామ్, ఎస్‌ఐ శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వ రోగాలకు యోగా దివ్య ఔషధం





శిక్షణ తరగతుల్లో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జేసీ సంపత్‌కుమార్ ; యోగాసనాలు సాధన చేస్తున్న యువత

జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సర్వ రోగాలకు యోగా దివ్య ఔషధమని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ప్రతి రోజు కొంత సమయం యోగాకు కేటాయిస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి ఉచిత యోగా శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ సంపత్ కుమార్ ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచే యోగాసనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఆరోగ్యకర జీవితానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. ప్రపంచ మానవాళికి గొప్ప వరం యోగా అని పేర్కొన్నారు. మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ముఖ్యంగా చిన్నారులు రోజంతా టీవీ, సెల్ ఫోన్లు చూస్తూ సమయాన్ని వృథా చేసుకోవడంతో పాటు అలసత్వానికి గురవుతున్నారని చెప్పారు. తల్లిదండ్రులు వారి పిల్లలు యోగాసనాల వైపు మక్కువ చూపేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ యోగాసనాలు చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించవచ్చని వివరించారు.

ఏటా 2 వేల మందికిపైగా శిక్షణ

అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చలసాని అజయ్ కుమార్ మాట్లాడుతూ.. 2017వ సంవత్సరం నుంచి తమ అసోసియేషన్ ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రతి ఏటా 2 వేల మందికి పైగా ఉచితంగా యోగా శిక్షణను అందిస్తున్నామన్నారు. కార్యదర్శి పి.వి.రమణ మాట్లాడుతూ.. యోగాసనాలను ప్రజలకు చేరువ చేయాలన్న ఉద్దేశంతో ఉచిత యోగా శిక్షణ తరగతులు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. యోగా గురువు అంకాల సత్యనారాయణ మాట్లాడుతూ.. ఉచిత వేసవి యోగా శిక్షణ శిబిరంలో యోగాసనాలు, సూర్య నమస్కారాలు ప్రాణాయామం వంటి వాటిలో శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మిరియాల వెంకటేశ్వరరావు, సీహెచ్ అరుణ్ కుమార్, ఎండీ ఇక్బాల్, కోశాధికారి లావణ్య కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీస్ కె.గాంధీ బాబు, కొనకళ్ల రెడ్డమ్మ, పిల్లి ప్రశాంత్ కుమార్, సభ్యులు, యోగా సాధకులు, ఏరోబిక్ డ్యాన్స్ కొరియోగ్రాఫర్ జార్జి పి.శాలెం రాజు, పి.మౌనిక, పి.శృతి తదితరులు పాల్గొన్నారు.

4న విజయోత్సవ ర్యాలీలు నిషేధం



మాట్లాడుతున్న వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన వెల్లడవుతున్న క్రమంలో నియోజకవర్గ పరిధిలో విజయోత్సవ ర్యాలీల నిర్వహణ నిషేధమని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి తెలిపారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రూరల్ ప్రాంతానికి చెందిన నేతలకు ఆదివారం జక్కంపూడి కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో పోలీసులు అవగాహన సదస్సును నిర్వహించారు. స్టేషన్ పరిధిలోని రూరల్ గ్రామాలకు చెందిన అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ముఖ్య నేతలను సమావేశానికి హాజరయ్యారు. కౌంటింగ్ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలను వెస్ట్ ఏసీపీ వివరించారు.


ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఎంతగానో సహకరించారని, అదే రీతిలో కౌంటింగ్ రోజున కూడా ఫలితాలు ఎలా ఉన్నా నాయకులు, ప్రజలందరూ సమన్వయంతో ఉండాలన్నారు. గెలిచిన వారు ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించరాదని, పోలీసుల సూచనలు పాటించకుండా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో కొత్తపేట సీఐ గణేష్, ఎస్‌ఐలు, సెక్టార్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు



నందిగామ: లాడ్జీల నిర్వాహకులు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హనీష్ హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో పట్టణంలోని పలు లాడ్జీలను పోలీసులు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, లాడ్జీల్లో ఉంటున్న వారి వివరాలను ఆరా తీశారు. లాడ్జీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు తరచూ తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. లాడ్జీ నిర్వాహకులు తప్పకుండా నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. తనిఖీల్లో ఎస్‌ఐ పండు దొర, పోలీసులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళాలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి యున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన మల్లెల నాగవెంకట పవన్, హేమంత్ కుమార్ రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు నగదును ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్‌కు అందజేశారు. గుంటూరు జిల్లా, యనమదలకు చెందిన దావులూరు సాంబశివరావు, శ్రీలక్ష్మి దంపతులు రూ.6 వేలు, గుంటూరు పట్టణం, మారుతీ నగర్‌కు చెందిన బీరం కృష్ణ సమంత రూ.5 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



నందిగామ: మండలంలోని జొన్నలగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికకు ఆదివారం వేదికగా మారింది. ఆ పాఠశాలలో 1989–90లో పదో తరగతి చదివిన విద్యార్థులు 34 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకుని సంబరాలు జరుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ముందుగా ఒకరికొకరు పరిచయం చేసుకుని, ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి దోహదపడాలని నిర్ణయించారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికకు కృషిచేసిన తోటిమిత్రులు నాగయ్య, దుర్గాప్రసాద్, జానీలను సత్కరించారు. పూర్వ విద్యార్థులు సురేష్, వెంకట్రామయ్య, శ్రీనివాసరావు, జనార్దన్, గిరి, రామారావు పాల్గొన్నారు.